AKSHARA TODAY

అక్షర నేటిడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

45 జీపీలకు ఒకటే అంబులెన్స్



2



2

జాతీయ రహదారిపై పప్పు లారీ బోల్తా..

ఎల్‌నినో నేపథ్యంలో ఆరుతడి పంటలనే సాగు చేయాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా రైతులు రబీలో ఆరుతడి పంటలనే సాగు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. నందిపేట మండలం నూత్‌పల్లి రైతు వేదికలో మంగళవారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె రైతులతో మాట్లాడారు. ఖరీఫ్‌లో వేసిన వరి పంట పూర్తిస్థాయిలో చేతికి అందేంత వరకు జిల్లా యంత్రాంగం తరపున కాపాడుతామని రైతులకు భరోసా కల్పించారు. రబీలో మాత్రం వరికి నీరిచ్చే పరిస్థితి లేదన్నారు. ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రావు, ఉద్యాన వన శాఖ అధికారిణి సంధ్య, సర్పంచ్ రాజిరెడ్డి పాల్గొన్నారు.



బాల్కొండ అభివృద్ధికి సీతక్క భరోసా!

అక్షరటుడే, భీమ్‌గల్: బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మోర్తాడ్ ప్రజాభవనం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి సీతక్క కు ముత్యాల సునీల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. బాల్కొండలోని పురాతన మార్కండేయ మందిర పునర్నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు కేటాయించాలని పద్మ శాలి సంఘం ప్రతినిధులు కోరారు. ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌కు మంత్రి సూచించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సునీల్ కుమార్ వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అందె వెంకటగిరి, కుందారపు శ్రీనివాస్, భూస రత్నాకర్, మామిడాల రాజు, తాటికొండ నరేందర్, బోగ గంగ కిషన్, తౌట్ కోటేశ్వర్ పాల్గొన్నారు.



ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మాక్లూర్ మండలం దాస్‌నగర్‌లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌ను సందర్శించి అక్కడ టేబుల్ టెన్నిస్ పోటీలకు వసతులను పరిశీలించారు. జాతీయ స్థాయిలో మొత్తం 20 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా.. టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ప్రభుత్వం ఎంపిక చేసిందని కలెక్టర్ అన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 150 మంది టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాకు రానున్న నేపథ్యంలో, అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. దాదాపు ఐదు రోజుల పాటు పోటీలు కొనసాగనున్నందున క్రీడాకారుల వసతి, భోజనం, తాగునీరు తదితర సదుపాయాలను సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయస్థాయి క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం ద్వారా నిజామాబాద్ జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. అదనపు కలెక్టర్ భుజంగరావు, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇన్‌ఛార్జీ డీఈవో సాయాగౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పవన్ కుమార్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, ఏసీపీ ప్రకాశ్ యాదవ్, సంతోష్, లత పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చి..ఇంటింటికీ చెత్త సేకరించేందుకు ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు కొనుగోలు చేశారు. అయితే వాటికి సంబంధించి బీమా కాలపరిమితి గతంలోనే ముగిసినా పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రజాధనంతో కొనుగోలు చేసిన వాహనాలు గ్రామాలకు ఉపయోగపడాల్సి ఉండగా, వాటి నిర్వహణ భారంగా మారితే అసలు లక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

– అక్షరటుడే, డిచ్‌పల్లి



పంచాయతీ ట్రాక్టర్లకు బీమా భారమాయే..

- జీపీ ట్రాక్టర్లకు ముగిసిన బీమా
- రెన్యూవల్ చేయని వైనం
- ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది?
- జీపీలకు భారంగా మారిన నిర్వహణ

నిజామాబాద్ జిల్లా లో 545 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో చెత్త సేకరణ, పారిశుధ్య పనుల కోసం ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లను వినియోగిస్తున్నారు. అయితే వాహనాలను సమకూర్చడంతోనే బాధ్యత అయిపోలేదు. వాటికి నిరంతరం డీజిల్, ఇంజిన్ ఆయిల్, విడి భాగాలు, మరమ్మతులు, ఇతర నిర్వహణ ఖర్చులు భరించాలి. వీటితోపాటు బీమా పునరుద్ధరణ ప్రధాన అంశం. అవసరమైన ధ్రువపత్రాల నిర్వహణ కూడా తప్పనిసరి. ఆదాయ వనరులు లేని గ్రామపంచాయతీల్లో ఈ ఖర్చులకు నిధులు ఎలా సమకూరుస్తున్నారన్నది కీలకంగా మారింది. సరైన నిర్వహణ లేకపోతే వాహనాలు తరచూ మరమ్మతులకు గురికావడం, చివరకు వినియోగానికి దూరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

బీమా గడువులపై నిఘా ఏదీ?

జిల్లాలోని దాదాపు అన్ని గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు బీమా గడువు ముగిసి ఏళ్లు కావస్తోంది. వాస్తవానికి ప్రతిఏడాది క్రమం తప్పకుండా బీమా రెన్యూవల్ చేయాలి. బీమా లేకుండా వినియోగిస్తే ప్రమాదాల బారినపడితే తీవ్ర ఆర్థిక, చట్టపరమైన సమస్యలు ఎదురయ్యే ముప్పు పొంచి ఉంది. ప్రజా అవసరాల కోసం ఉపయోగించే వాహనాల విషయంలో ఈ అంశాన్ని మరింత బాధ్యతగా చూడాలి. ఏ వాహనానికి బీమా ఎప్పటివరకు ఉంది..? ఎన్ని వాహనాలకు ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు చెల్లుబాటులో ఉన్నాయి..? రిజిస్ట్రేషన్, ఇతర అనుమతులు సక్రమంగా ఉన్నాయా..? అనే వివరాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలి..

ఖర్చుల భారం..

ట్రాక్టర్లు, ట్రాలీల నిర్వహణకు నిధులు సరిపోకపోతే మరమ్మతులు వాయిదా పడే అవకాశం ఉంది. దీంతో చెత్త సేకరణ, పారిశుధ్య పనులకు ఆటంకం కలగవచ్చు. వాహనాలు అందుబాటులో లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి వస్తుంది. ఇది పంచాయతీలపై అదనపు భారాన్ని మోపడంతోపాటు గ్రామస్తులకు అసౌకర్యం కలిగించే ప్రమాదం నెలకొంది. జిల్లాలో ఎన్ని వాహనాలు పనిచేస్తున్నాయి, ఎన్ని మరమ్మతుల్లో ఉన్నాయి, ఎన్ని నిరుపయోగంగా ఉన్నాయనే దానిపై వివరాలు సేకరించాలని పలువురు కోరుతున్నారు.

డ్రైవర్ల నియామకంపై స్పష్టత కరవు?

ట్రాక్టర్లు, ఇతర వాహనాలను నడిపేందుకు అర్హత కలిగిన డ్రైవర్లు అవసరం. ప్రత్యేక డ్రైవర్లను నియమించడం, వారికి జీతాలు చెల్లించడం పంచాయతీలకు అదనపు ఖర్చుగా మారిందని సర్పంచులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో డ్రైవర్ల నియామకం, వేతనాల చెల్లింపు, విధుల కేటాయింపుపై స్పష్టమైన విధానం ఉండాలంటున్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీల వారీగా వాహనాల సంఖ్య, ప్రస్తుత స్థితి, బీమా గడువు, ఫిట్‌నెస్, మరమ్మతుల వ్యయం, డ్రైవర్ల అందుబాటు వంటి అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉంది. అధికారులు వాస్తవ పరిశీలించి, లోపాలుంటే సరిదిద్దే చర్యలు చేపట్టాలి.

ఢిల్లీకి మూటలు మోసే ముఠామేస్త్రీ రేవంత్ రెడ్డి

అక్షరటుడే, డిచ్‌పల్లి: సీఎం రేవంత్ రెడ్డి తన పదవి కాపాడుకునేందుకు ఢిల్లీకి మూటలు మోసే ముఠామేస్త్రీ లా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎద్దేవా చేశారు. నగర శివారులోని మాధవనగర్ బ్రిడ్జ్ వద్ద చేపట్టిన నిరసన దీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉత్తర తెలంగాణకు నిధులు కేటాయించకుండా కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిధులను కొడంగల్ నియోజకవర్గానికి తీసుకుపోతున్నాడని విమర్శించారు. అబద్ధపు హామీలతో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పబ్బం గడుపుతున్నారని, ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రూ.లక్షల కోట్ల అవినీతి చేస్తూ భూములు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. దేశంలో అల్లర్లు సృష్టించాలని కాంగ్రెస్ కుయుక్తులు చేస్తోందని ఆరోపించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. మాధవనగర్ గేటు మీదుగా నిత్యం సుమారు నాలుగైదు వేల వాహనాలు, 58 రైళ్లు ప్రయాణం చేస్తాయన్నారు. ఒక్కసారి గేటు పడితే ఇరువైపుల పెద్ద సంఖ్యలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిజామాబాద్‌పై ఎందుకు వివక్ష చూపుతోందని ప్రశ్నించారు. లక్షలాది ప్రజల ఇబ్బందులు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి ఆర్వోబీ కోసం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ అర్వింద్ నిరసన దీక్షలో భాగంగా భిక్షాటన చేశారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుమార్ కులాచారి, రాష్ట్ర నాయకులు గద్దె భూమన్న, మేడపాటి ప్రకాష్, మల్లికార్జున్, ప్రవంతి రెడ్డి, పోతంకర్ లక్ష్మినారాయణ, మారెడ్డి అనిత తదితరులు పాల్గొన్నారు.



కేదారేశ్వర ఆశ్రమంలో గోపూజ, బానలింగ అభిషేకం



అక్షరటుడే, నందిపేట్: మండల కేంద్రంలో కేదారేశ్వర ఆశ్రమంలో అనుస్థాన దీక్ష కార్యక్రమాన్ని కేదారనంద స్వామీజీ నిర్వహించారు. 41వ దీక్ష కార్యక్రమంలో భాగంగా గోపూజ, బానాలింగ అభిషేకము, గురు చరిత్ర పారాయణ కార్యక్రమం చేపట్టారు. ఈ క్రతువులో భక్తులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణపై ప్రణాళికతో ముందుకెళ్లాలి : సీపీ

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణపై ప్రణాళికతో ముందుకెళ్లాలని సీపీ సాయిచైతన్య అన్నారు. మెండోరాలో 54 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమన్నారు. ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాల ద్వారా గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, మెండోరా ఎస్సై సుహాసిని, సర్పంచ్ ప్రమోద్ పాల్గొన్నారు.

మినీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

అక్షరటుడే, మాక్లూర్: మాక్లూర్‌లో ఉన్న మినీ గురుకులంలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమాధికారి గంగారాం నాయక్ తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి చదివే గిరిజన బాలికలు అర్హులని చెప్పారు. ఎంపిక ప్రక్రియ అదనపు కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు పత్రాలను ఆయా గురుకులాల్లో సమర్పించాలని ఆయన సూచించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం



అక్షరటుడే, రామారెడ్డి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం ఆమె రామారెడ్డి, సదాశివనగర్ మండలాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, భూమిపూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రామారెడ్డి మండలంలోని పోసానిపేట గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించారు. హ్యామ్ ఫేజ్-1లో భాగంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 71.63 కి.మీ రహదారుల అభివృద్ధి పనులకు రూ.42.80 కోట్లతో శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గిద్ద గ్రామ ప్రజల చిరకాల డిమాండ్ అయిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.88 కోట్ల నిధులతో సబ్‌స్టేషన్ పనులకు భూమిపూజ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఏకంగా 7 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్ చూపిన ప్రత్యేక చొరవ, పట్టుదల అభినందనీయమని కొనియాడారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌తో మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల భేటీ

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజాగౌడ్‌తో సమావేశమయ్యారు. ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజాగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన జీవోకు అనుగుణంగా అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ విషయంలో కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పారదర్శకంగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీపీఆర్‌వో పద్మశ్రీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ సమాచార ఇంజినీర్ ఉమేష్ చంద్ర, డీఎంఏసీ సభ్యులు కోయల్‌కర్ రామ్ దయానంద్, ఆర్ భూపతి, జి సాయి ప్రసాద్, ఎంఏ మాజిద్, ఎల్ బాల్ కుమార్, ఎస్ శ్రీకాంత్, ఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోలీస్ అమరుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలి



అక్షరటుడే, కామారెడ్డి: విధి నిర్వహణలో దేశం, సమాజం, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను, త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కామారెడ్డి పట్టణంలో సుమారు 4 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీ వద్ద ఎస్పీ జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించడంతో పాటు స్వయంగా సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ సైకిల్ ర్యాలీ ముఖ్య ఉద్దేశం అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడం, పోలీసుల విధులు, సేవల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడమని పేర్కొన్నారు. ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ పాల్గొన్నారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
మంగళవారం
27.10.2026

www.aksharatoday.in
AKSHARA TODAY

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: రేషన్ డీలర్లకు గౌరవవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ప్రజ్ఞాపూర్ లో జరిగిన రాష్ట్ర రేషన్ డీలర్ల గౌరవ వేతనం సాధన సభకు రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. రేషన్ డీలర్లకు నెలకు రూ.5వేల గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. క్వింటాల్‌కు ఇస్తున్న రూ.140 కమిషన్‌ను రూ.300 చేయాలన్నారు. దిగుమతి హమాలీ కూడా ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ రేషన్‌డలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి చిట్టి పార్థసారథి, ఎల్పుల ప్రవీణ్ యాదవ్ పాల్గొన్నారు.

చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో మొసలి ప్రత్యక్షం



అక్షరటుడే, పోచంపాడ్: పోచంపాడ్ లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో మొసలి పిల్ల ప్రత్యక్షమైంది. దీంతో ఒక్కసారిగా అధికారులు అప్రమత్తమయ్యారు. చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో 31వ నంబర్ సిమెంట్ నర్సరీలో మొసలి పిల్లను గుర్తించారు. ఎన్నడూలేని విధంగా నర్సరీల్లోకి మొసలి రావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వెంటనే జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్‌కు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్మూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఆధ్వర్యంలో క్లస్టర్ ఫారెస్ట్ అధికారి గంగాధర్ నాయక్ తన బృందంతో అక్కడికి చేరుకున్నారు. మొసలి పిల్లను సురక్షితంగా పట్టుకుని వెంటనే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) లో వదిలిపెట్టారు. మొసలి పిల్లను సురక్షితంగా తరలించిన నిజామాబాద్ అటవీ శాఖ అధికారులకు మత్స్య అభివృద్ధి అధికారియల్. దామోదర్ కృతజ్ఞతలు తెలిపారు.

గాంధారి మండలంలో అత్యవసర పరిస్థితిలో చికిత్స కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఒకే ఒక్క అంబులెన్స్‌తో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. 45 గ్రామ పంచాయతీలతో కూడిన గాంధారి మండలంలో ఒకేఒక అంబులెన్స్‌తో సేవలు పూర్తిస్థాయిలో అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- అక్షరటుడే, గాంధారి



45 జీపీలకు ఒక్కటే అంబులెన్స్

- 72 పల్లెలు, 50 వేలకు పైగా జనాభా
- అత్యవసర సేవల ఆలస్యంతో అవస్థలు..
- పట్టించుకోని వైద్యశాఖాధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నిత్యం రద్దీతో ఉండే మండల కేంద్రంలోనే దాదాపు 10 వేలకు పైగా జనాభా ఉంటుంది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని అంబులెన్స్ మండల కేంద్రానికే సరిపోతుంది. కానీ, మండలంలోని 45 గ్రామ పంచాయతీల పరిధిలో ఒకేసారి తీవ్ర అత్యవసర పరిస్థితులు వస్తే ఎటు వెళ్లాలో తెలియక అంబులెన్స్ పైలట్లు తీవ్ర సతమతమవుతున్నారు.

50 వేలకు పైగా జనాభా..

గాంధారి మండలంలో 72 పల్లెలు, దాదాపు 50 వేలకు పైగా జనాభా ఉంది. అయితే మండలం మొత్తానికి ఉన్న ఒకేఒక అంబులెన్స్ ఎంతమందికి అని సేవలు అందిస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల అందరికీ సేవలు అందుబాటులో లేని పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు. ఈ జనాభాకు కనీసం మరొక అంబులెన్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. ఒకే సమయంలో రెండు, మూడు అత్యవసర పరిస్థితులు తలెత్తితే 108 సేవలు అందక పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది.

నిత్యం రద్దీగా ఉండే పల్లెలు..

మండలంలోని పల్లెల్లో నిత్యం ఏదో ఒక చోట సంతలు జరుగుతుంటాయి. రూ.లక్షల్లో వ్యాపారాలు సైతం జరుగుతుంటాయి. అలాగే రద్దీ ఉండే ప్రాంతాల్లో అపుడప్పుడు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఒకేసారి రెండుమూడు ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగితే పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోందని పైలెట్లు సైతం వాపోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

గాంధారి మేజర్ గ్రామ పంచాయతీ అయినందున ఇక్కడ మరొక అంబులెన్స్ అవసరం ఉందని ఉన్నతాధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం. మేజర్ పంచాయతీ కావడంతో తప్పనిసరిగా ఇంకో అంబులెన్స్ మంజూరు చేయాలని నివేదిక సమర్పించాం. అధికారులు స్పందించి అంబులెన్స్ ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– తిరుపతి, 108 ఇన్‌ఛార్జ్, కామారెడ్డి



సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ

అక్షరటుడే, నందిపేట్: మండల కేంద్రంలోని రైతువేదిక ప్రాంగణంలో మంగళవారం రైతులకు సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏవో రాంబాబు మాట్లాడుతూ.. పంట దిగుబడి కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయన ఎరువులు పురుగు మందులతో భూమి సారం దెబ్బతింటుందన్నారు. అలాగే మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పశువుల వర్మీ కంపోస్ట్, జీవామృతం, ఘన జీవామృతంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో కెఎఫ్‌సీఎల్ చైర్మన్ వినయ్, ఏఈవోలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నైట్ పెట్రోలింగ్ చేసేలా చర్యలు తీసుకుంటాం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నైట్ పెట్రోలింగ్ చేసేలా చర్యలు తీసుకుంటామని సౌత్ రూరల్ సీఐ భిక్షపతి పేర్కొన్నారు. పోలీసు సంస్మరణ దిన వారోత్సవాల్లో భాగంగా కులాస్‌పూర్ గ్రామాన్ని సందర్శించారు. మోపాల్ ఎస్సై సుష్మితతో కలిసి గ్రామాన్ని సందర్శించిన అనంతరం గ్రామాస్తులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తే బాగుంటుందని గ్రామస్తులు కోరగా దానికనుగుణంగా ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాద స్థలాలను పరిశీలించారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి సర్పంచ్ సహకారంతో ట్రాక్టర్‌తో వాటిని తొలగింపజేశారు.

అధ్యాపకులు ఖచ్చితంగా ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ఇవ్వాలి



అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను డీఐఈవో రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రిన్సిపల్ గంధం బుద్ధిరాజ్ అధ్యక్షతన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి అధ్యాపకుడు సమయాపాలన పాటిస్తూ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి క్లాస్ ఇన్‌ఛార్జి అధ్యాపకులు, విద్యార్థినుల ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను ఉదయం 10:30 గంటల్లోగా తీసుకొని ఫార్వర్డ్ చేయాలని ఆదేశించారు. ఇంకా అటెండెన్స్‌లో ఫేస్ రికగ్నిషన్ చేయని విద్యార్థుల చేత వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులను ప్రాక్టికల్స్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రాక్టికల్స్ తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. డిసెంబర్ వరకు సిలబస్ మొత్తం పూర్తి చేయాలన్నారు.

జాతీయ రహదారిపై పప్పు లారీ బోల్తా.. డ్రైవర్‌కు స్వల్పగాయాలు

అక్షరటుడే, డిచ్‌పల్లి: జాతీయ రహదారిపై నిర్మాణ పనుల నేపథ్యంలో ఏర్పాటు చేసిన డైవర్షన్ వద్ద ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఇందల్వాయి మండలం చంద్రాయన్ పల్లి శివారులో మంగళవారం ఉదయం కందిపప్పు లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. లారీబోల్తా పడిన ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. మహబూబ్‌నగర్ నుంచి నాగ్‌పూర్‌కు వైపు వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై బోల్తాపడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లారీరోడ్డుపై పడిపోవడంతో సుమారు 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. సుమారు 2గంటల పాటు శ్రమించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా అకస్మాత్తుగా డైవర్షన్ ఏర్పాటు చేయడం వల్లే ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులకు ముందస్తు సూచనలు, తగిన హెచ్చరిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు సమర్థంగా లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోందని ఆరోపిస్తున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగినచర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.





ఒక సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానం

అక్షరటుడే, లింగంపేట : ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు అన్నారు. మండలంలోని పర్మల్ల గ్రామంలో మంగళవారం 5 సోలార్ సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు ఉంటే గ్రామం నిఘా వలయంలో ఉంటుందన్నారు. పర్మల్ల ప్రజల శ్రేయస్సు కోసం సర్పంచ్ గడ్డం బాబాయి నరేష్, పాలకవర్గం సూతనంగా గ్రామంలో 5 సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం బాబాయి నరేష్, ఎస్సై దీపక్ కుమార్, ఉప సర్పంచ్ కొడబోయిన శ్రీను, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడబోయిన శ్రీనివాస్, లింగంపేట్ మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ బద్ధ చందు, పీఏసీఎస్ డైరెక్టర్ సాయికుమార్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్లు గుండ్రె రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కుమ్మరి సిద్ధిరాములు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు ఆధ్వర్యంలో దంతవైద్యశిబిరం



అక్షరటుడే, ఇందూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ మండలంలోని ధర్మారం తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత వైద్య నిపుణుడు జమాల్ పూర్ రాజశేఖర్ పాఠశాల విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దంతాల పట్ల నిర్లక్ష్యం పనికిరాదని పేర్కొన్నారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టూత్ పేస్టులు, బ్రష్‌లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షకార్యదర్శులు పి.రాఘవేంద్రబాబు, చింతల గంగాదాస్, ఇరుమల శివలింగం, అంకం రాజేందర్ పాల్గొన్నారు.

బీజేపీ సన్నాహక సమావేశానికి నూతుల శ్రీనివాస్ హాజరు



అక్షరటుడే, ఆర్మూర్: వచ్చేనెల 2న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో ప్రజాపరిరక్షణ యాత్ర నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి బీజేపీ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్మూర్‌కు చెందిన కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూతల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి దేవర శ్రీనివాస్ రాజశేఖర్ పంతులు, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

కిసాన్‌నగర్ లయన్స్ భవనంలో కంటి వైద్య శిబిరం



అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 15మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిశుక్లం (మోతిబిందు) ఉన్నవారిని గుర్తించి, శస్త్రచికిత్సల నిమిత్తం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. పేదలకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి వైద్య సేవలు అందించడంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లయన్స్ క్లబ్ ఛైర్మన్ చాకు లింగం, బాల్కొండ లయన్స్ క్లబ్ కార్యదర్శి కనకయ్య గౌడ్, కోశాధికారి రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.